క్లుప్తంగా

రైస్‌మిల్లుల్లో తనిఖీలు



సాక్షి ఎఫెక్ట్

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలోని రైస్‌మిల్లుల్లో సీఎంఆర్ ధాన్యం నిల్వలపై జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. సాక్షిలో ప్రచురితమైన ''మిల్లర్ల మాయాజాలం.. సీఎంఆర్ ధాన్యం మాయం''కథనంపై అధికారులు స్పందించారు. రైస్‌మిల్లుల్లో ఉన్న నిల్వలపై అదనపు కలెక్టర్ నివేదిక అందించనున్నట్లు డీసీఎస్‌ఓ బ్రహ్మారావు తెలిపారు.

సర్వే అధికారుల నిర్బంధం



సర్వే అధికారులను నిర్బంధించిన భూ నిర్వాసితులు

నర్సాపూర్ రూరల్: కొండపోచమ్మ టు సంగారెడ్డి రీచ్–2 కాలువ కోసం సేకరించే భూములను సర్వే చేసేందుకు వచ్చిన అధికారులను భూ నిర్వాసితులు నిర్బంధించారు. మంగళవారం నర్సాపూర్ మండలం చిన్న చింతకుంట గ్రామానికి నీటిపారుదల శాఖ అధికారులు కొండపోచమ్మ టు సంగారెడ్డి రీచ్ 2 కాలువ కోసం భూములు సర్వే చేసేందుకు వచ్చారు. విషయం తెలుసుకున్న భూ నిర్వాసితులు సర్వేను పనులను అడ్డుకొని అధికారులను గ్రామపంచాయతీ భవనంలో బంధించారు. సమాచారం అందుకున్న పోలీసులు చింతకుంటకు చేరుకొని అధికారులను విడిపించారు. ఈ సందర్భంగా భూ నిర్వాసితులు మహేష్ గౌడ్, నరసింహారెడ్డి తదితరులు మాట్లాడుతూ భూమికి భూమి లేదా ఎకరాకు రూ 60 లక్షలు ఇస్తే భూములు ఇస్తామని లేదంటే భూములు సర్వే చేయనీయబోమని స్పష్టం చేశారు.

ఐకేపీ వీఓఏలకు కనీస వేతనం ఇవ్వాలి

సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నగేష్

మెదక్ కలెక్టరేట్: స్వయం సహాయక సంఘాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్న ఐకేపీ వీఓఏలకు గ్రేడింగ్‌తో ముడిపెట్టకుండా కనీస వేతనాలు ఇవ్వాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నగేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఐకేపీ వీఓఏల మెదక్ జిల్లా విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన నగేశ్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 500లకుపైగా మంది వీఓఏలు పనిచేస్తున్నట్లు చెప్పారు. మహిళా స్వయం సహాయక బృందాలు ఏర్పాటు చేస్తూ ఆర్థికంగా, సామాజికంగా ఎదిగేలా వారికి అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. వీఓఏలను సెర్ప్ నుంచి కేవలం రూ.5వేల గౌరవ వేతనమే ఇస్తున్నట్లు తెలిపారు. వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు రూ.10 లక్షల సాధారణ భీమా సౌకర్యం, ఆరోగ్య భీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు మహేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వీఓఏలకు కనీస వేతనం రూ 26,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కిష్టయ్య, స్వరూప, లక్ష్మి, అనురాధ, కవిత, మంజుల, శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

ఐడీ కార్డుల అందజేత

హవేళీఘణాపూర్(మెదక్): దాత శ్రీనివాస్ చౌదరి సహకారంతో మాచవరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫామ్స్, ఐడీ కార్డులను జిల్లా విద్యాధికారి రాధాకిషన్ పంపిణీ చేశారు. విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తున్న దాత శ్రీనివాస్ చౌదరిని అభినందించారు. ఎంఈఓ నీలకంఠం, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

శివ్వంపేట(నర్సాపూర్): సమాజంలో ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఆధారపడి ఉందని మాజీ జెడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా అన్నారు. మండల పరిధిలోని పాంబండ ఉన్నత పాఠశాలకు మంగళవారం ల్యాప్‌టాప్ అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మోహన్‌రావు, ఉపాధ్యాయులు వామనశర్మ, శ్రీధర్‌రావు, బీఆర్ఎస్ నాయకులు కృష్ణారావు, రాజశేఖర్‌గౌడ్, కృష్ణారావు, నవీన్‌గౌడ్, గోపాల్, తదితరులు ఉన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

చిలప్‌చెడ్(నర్సాపూర్): పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఎంపీడీఓ ఆనంద్ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని బండపోతుగల్ గ్రామంలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాలను పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఆనంద్ పాల్గొన్నారు.

అంతా మాఇష్టం

ఇష్టారాజ్యంగా కేజీబీవీ టీచర్లు, సిబ్బంది తీరు

- విద్యార్థినులతో పనులు
- అనుమతి లేకుండానే పాత సామగ్రి అమ్మకం
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని ఉన్నతాధికారులు



కేజీబీవీలో విక్రయించి, ఆటోలో తరలిస్తున్న పాత సామగ్రి

అల్లాదుర్గం(మెదక్): గ్రామీణ ప్రాంతాల్లో బాలికలకు మెరుగైన విద్యనందించేందుకు ప్రభుత్వం కస్తూర్బా గాంధీ విద్యాలయాలను ఏర్పాటు చేసింది. ఏళ్ల తరబడి అక్కడే విధులు నిర్వహిస్తున్న టీచర్లు, సిబ్బంది ఇష్టారాజ్యంగా విధులకు హాజరవుతున్నారు. మరోవైపు సిబ్బంది విద్యార్థినులతోనే పనులు చేయిస్తున్నారు. అధికారులు, కమిటీ అనుమతులు లేకుండానే ప్రిన్స్‌పాల్ పాత సామగ్రి, పుస్తకాలు విక్రయిస్తుండగా స్థానికులు పట్టుకున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా.. విచారణ చేపట్టడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ఇది అల్లాదుర్గం కేజీబీవీ దుస్థితి. కేజీబీవీ పాత సామగ్రి, పుస్తకాలు, నోట్ పుస్తకాలు పెరుకుపోయాయి. సామగ్రిని విక్రయించాలంటే కమిటీ తీర్మానం చేసి అధికారులకు పంపాలి. జిల్లా అధికారుల అనుమతితో సామగ్రిని విక్రయించాలి. సామగ్రి అమ్మగా వచ్చిన ఆదాయాన్ని పాఠశాలకు మాత్రమే వినియోగించాల్సి ఉంటుంది. పాఠశాల ప్రిన్స్‌పాల్ ఏ తీర్మాణం, అనుమతులు లేకుండా సొంత గ్రామానికి చెందిన వ్యక్తులకు సామగ్రిని సోమవారం విక్రయించి ఆటోలో తరలిస్తుండగా స్థానికులు పట్టుకున్నారు. మండల, జిల్లా స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదన్నారు. కేజీబీవీ మరమ్మతు పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. పాఠశాల గేటుకు అడ్డంగా కాంట్రాక్టర్ ఇసుక అడ్డుగా వేశారు. ఆ ఇసుకను విద్యార్థినులతో కలిసి సిబ్బంది తొలగించారు. దీంతో తరగతులు కొనసాగుతుండగా విద్యార్థులు బయటకు వచ్చి పనులు చేయడమేమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కేజీబీవీలో టీచర్లు, లెక్చరర్లు సమయపాలన పాటించకుండా ఇష్టం వచ్చినట్లు విధులకు హాజరవుతున్నారని స్థానికులు చెబుతున్నారు.

సామగ్రి అమ్మింది వాస్తవమే

పాఠశాలలో పెరుకుపోయిన పాత సామగ్రిని అమ్మింది వాస్తవం. సిబ్బంది గతంలో పాత సామగ్రిని విక్రయించే వారని చెప్పడంతో మేము విక్రయించాం. స్థానికులు అడ్డుకోవడంతో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు విక్రయాలను నిలిపివేశాం. - ప్రిన్స్‌పాల్ స్రవంతి

చర్యలు తీసుకుంటాం

అల్లాదుర్గం కేజీబీవీలో పాత సామగ్రి విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. విచారణ చేసి చర్యలు తీసుకుంటాం. ఏ సమస్యలు ఉన్న మా దృష్టికి తెస్తే విచారణ చేపట్టి పరిష్కరిస్తా. తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకుంటాం. - డీఈఓ రాధాకిషన్

పీహెచ్‌సీలో ఓపీ సేవలు నిర్వహించాలి



జిల్లా వైద్యాధికారి సాయిరాంకు వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో పీహెచ్‌సీలో ఓపీ సేవలు ప్రారంభించాలని కాంగ్రెస్ నాయకులు జిల్లా వైద్యాధికారి సాయిరాంకు వినతిపత్రం అందజేశారు. మంగళవారం మండల పరిధిలో పీహెచ్‌సి లేకపోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జిల్లా వైద్యాధికారి సానుకూలంగా స్పందించి ఆగస్టు 15 నుంచి ఓపీ సేవలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పంజా మహేందర్, నసీరుద్దీన్, మారుతి, వెంకటగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



గ్యాస్ సిలిండర్లు అందజేస్తున్న రవి

శివ్వంపేట(నర్సాపూర్): పేద, మధ్యతరగతి కుటుంబాల కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ మండలాధ్యక్షుడు రవి అన్నారు. ఉజ్వల పథకం ద్వారా మంజూరైన గ్యాస్ సిలిండర్లను లబ్ధిదారులకు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సుదర్శన్, శ్రీనివాస్, రాజు, సత్యనారాయణ, శ్రీధర్‌గౌడ్, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

● పుస్తక పఠనంతో విజ్ఞానం: ప్రిన్సిపాల్ సంజయ్



లైబ్రేరియన్ దినోత్సవంలో పాల్గొన్న కాలేజీ ప్రతినిధులు, విద్యార్థులు

నర్సాపూర్: పుస్తక పఠనంతో మంచి ఆలోచనలు వస్తాయని, విజ్ఞానం పెరుగుతుందని బీవీ రాజు ఇంజనీరింగు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంజయ్ దూబె చెప్పారు. మంగళవారం జాతీయ లైబ్రేరియన్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని కాలేజీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన హాజరై, మాట్లాడారు. పుస్తకాలు చదివి మంచి భవిష్యత్‌కు పునాది వేసుకోవాలని సూచించారు. కెమికల్ ఇంజనీరింగు హెచ్‌ఓడీ రాధిక మాట్లాడారు. కార్యక్రమంలో కాలేజీ మేనేజర్ బాపిరాజు, ఏఓలు సురేశ్, అశోక్‌రెడ్డి, కాలేజీ లైబ్రేరియన్ మల్లికార్జున్ పాల్గొన్నారు.

నస్కల్ రోడ్డు పూర్తి చేయాలి

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని నస్కల్, నందగోకుల్, చల్మెడ, రాంపూర్ రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలని అధికారులకు మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం నస్కల్, నందగోకుల్, చల్మెడ, రాంపూర్ గ్రామాల కార్యకర్తలు ఎంపీ క్యాంప్ కార్యాలయంలో కలిసి రోడ్డు ఇబ్బందులు తెలిపారు. వెంటనే ఎంపీ ఆర్‌అండ్‌బీ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్‌తో ఫోన్‌లో మాట్లాడారు.

మెదక్‌లో లోక్‌అదాలత్

మెదక్ కలెక్టరేట్: మెదక్ జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రధాన న్యాయ సముదాయంలో మంగళవారం స్పెషల్ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి పి.లక్ష్మిశారద ఒక కేసులో ఇరువర్గాల మధ్య రాజీ కుదిర్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. రామాయంపేట మండలం దామర చెర్వు. మెదక్‌లోని వ్యవసాయ భూమి విషయంలో కమలాకర్, మెట్టు మల్లేశంల మధ్య స్పెషల్ లోక్ అదాలత్‌లో న్యాయమూర్తి రాజీ చేశారు. న్యాయవాదులు జీవన్ రావు, సుభాష్‌చంద్రగౌడ్, రవీందర్, కిరణ్ రాజ్, దుర్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెదక్ ఎంపీని కలిసిన నాయకులు

టేక్మాల్(మెదక్): మెదక్ ఎంపీ రఘునందన్ రావును మెదక్‌లో మంగళవారం టేక్మాల్ బీజేపీ నాయకులు కలిసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లగా, తమ సమక్షంలోనే ఫోన్ చేసి అధికారులకు వివరించినట్లు తెలిపారు. తమ సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కారానికి కృషి చేసిన ఎంపీకి మండల బీజేపీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్లుపేట రాజు, నాయకులు సేనాపతి, పవన్‌కుమార్, రాములు తదితరులు ఉన్నట్లు తెలిపారు.

చేసిన సేవలు గుర్తుండిపోతాయి

శివ్వంపేట(నర్సాపూర్): ఉద్యోగ సమయంలో చేసిన సేవలు ఎప్పటికి గుర్తుండిపోతాయని చండీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సురేందర్ అన్నారు. పాఠశాల నుంయి బదిలీపై వెళ్లిన శాస్త్రుల వామనశర్మ, హేమలత, విజేందర్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంతోష్‌కుమార్‌గుప్తా, దయానంద్‌రెడ్డి, అరుణ, రోజ్ మేరి, వెంకటరామారావు, గౌరిశంకర్ శర్మ, తదితరులు ఉన్నారు.

అభినందనీయం

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రం చిన్నశంకరంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నాగేందర్ సేవలు అభినందనీయమని అధ్యాపకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీపై వెళ్తున్న నాగేందర్‌ను సన్మానించారు. నూతన ప్రిన్సిపాల్ శశిధర్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

తరగతి గదిలో ప్రపంచం చూపే వారే గురువులు

పాపన్నపేట(మెదక్): తరగతి గదిలో ప్రపంచం చూపే వారే ఉత్తమ గురువులని కుర్తివాడ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు అన్నారు. పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు అంజాగౌడ్, బూలిభాయ్, నాగభూషణం, నరేందర్, వెంకటేశం, మనోహర్, స్వరూప, శ్రీనివాస్ రెడ్డిలకు వీడ్కోల్ సమావేశం ఏర్పాటు చేశారు. బదిలీ అయిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఉపాధ్యాయులు, ఎంపీటీసీ రమేశ్‌గౌడ్, చంద్రశేఖర్, సౌందర్య పాల్గొన్నారు.



పాపన్నపేట(మెదక్): టీచర్లకు సన్మానిస్తున్న హెచ్‌ఎం శ్రీనివాసరావు



శివ్వంపేట(నర్సాపూర్): ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నాయకులు

బస్సు సౌకర్యం కల్పించండి



చిలప్‌చెడ్ ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న విద్యార్థులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఆర్టీసీ బస్సులు సమయానికి రాకపోవడంతో విద్యార్థులు జోగిపేట్ – నర్సాపూర్ ప్రధాన రహదారిపై ధర్నా చేశారు. ఈ ఘటన మండల కేంద్రం చిలప్‌చెడ్‌లో మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కాలేజీకి వెళ్లేందుకు సమయానికి బస్సులు రాకపోవడంతో నానా ఇబ్బందులకు గురవుతున్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమయానికి కాలేజీకి వెళ్లలేకపోతున్నామని వాపోయారు. తమకు సమయానికి బస్సు సౌకర్యం కల్పించాలని ధర్నా చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఏఎస్‌ఐ మిస్బావుద్దీన్ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ధర్నా విరమించారు.

వైభవంగా మంగళ గౌరీ వ్రతం



మంగళగౌరీ వ్రతం ఆచరిస్తున్న మహిళలు

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో మంగళవారం హనుమాన్ దేవాలయంలో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో స్త్రీశక్తి – మాతృశక్తి మహిళలు అందరు కలిసి మంగళగౌరీ వ్రతం ఆచరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పావని, పబ్బా సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామ పురోహితులు వేలేటి లక్ష్మణ శాస్త్రి మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు సంస్కృతి సంప్రదాయాలను ఆచరించాలని అన్నారు. కార్యక్రమంలో పురోహితులు రాంమోహన్ శర్మ, విశ్వహిందూ పరిషత్ సభ్యులు జిపి స్వామి, మహేష్, తిరుపతి, వెంకటేశం, శివ కుమార్, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

కొడిపల్లికి రూ.1.11లక్షల ఆదాయం



మాట్లాడుతున్న ఏపీఎం సంగమేశ్వర్

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కొడిపల్లి గ్రామ సంఘానికి రూ.1.11 లక్షల ఆదాయం వచ్చిందని ఏపీఎం సంగమేశ్వర్ అన్నారు. మంగళవారం ఐకేపీ కార్యాలయంలో ఒకటవ గ్రామ సంఘం మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత సంవత్సరానికి సంబంధించి ఆడిట్ నిర్వహించగా రూ.1.11 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. మహిళా సంఘాల సభ్యులు కృషితోనే ఇది సాధ్యమైందన్నారు. మహిళా సంఘాల సభ్యులు ప్రభుత్వం అందజేసే రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. రుణాలు సక్రమంగా చెల్లించడంతో పాటు, పొదుపు చేసుకోవాలన్నారు. ప్రతీ నెల లెక్కలు సక్రమంగా చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ మండల సమాఖ్య అధ్యక్షురాలు మమత, సీసీ రమేశ్, సీఏలు, మహిళలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **సన్మానం**

కౌడిపల్లి(నర్సాపూర్): ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్తున్న ఓ విద్యార్థినిని మంగళవారం మెదక్ ఎంపీ రఘునందన్‌రావు మెదక్‌లో సన్మానించారు. కౌడిపల్లి మండలం బూరుగడ్డకు చెందిన భీమ్ గోపాల్ కమార్తె స్వాతి ఫ్లోరిడా యూనివర్శిటీలో ఎంఎస్ చదివేందుకు త్వరలో అమెరికా వెళ్లనున్నవిషయం తెలుసుకున్న మెదక్ ఎంపీ ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్ షేకులు పాల్గొన్నారు.

◆ **పట్టుచీర అందజేత**

నర్సాపూర్: పేద పెండ్లి కుమార్తెలకు పబ్లిక్ స్కూల్ చైర్మన్ కవిత తన వంతుగా సాయం అందజేస్తున్నారు. హత్నూర మండలంలోని బ్రాహ్మణగూడకు చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన పెళ్లి కూతురు నిహారికకు పట్టుచీర అందజేసినట్లు ఆమె తెలిపారు.

◆ **కొంతన్‌పల్లిలో బోనాలు**

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని కొంతన్‌పల్లి గ్రామంలో బోనాల పండుగను సోమవారం రాత్రి నిర్వహించారు. గ్రామంలో కొలువైన దుర్గమ్మకు గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాలు, తొట్టెల, జలపందిరిని ఊరేగించారు. ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, నర్సింలు పాల్గొన్నారు.

◆ **వాతావరణానికి అనుగుణంగా పంటలు వేయాలి**

మనోహరాబాద్(తూప్రాన్): రైతులు వాతావరణానికి అనుగుణంగా పంటలు వేసుకోవాలని నర్సాపూర్ ఏడీఏ సంధ్యారాణి అన్నారు. మంగళవారం మనోహరాబాద్ రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి స్రవంతి, ఏఈఓలు నరేందర్, సచిన్, రైతులు పాల్గొన్నారు.

◆ **అమ్మవారికి లక్ష గాజుల అలంకరణ**

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలోని మహంకాళి అమ్మవారికి మంగళవారం లక్ష గాజులతో అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు రాఘవశర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం లలిత సహస్రనామ పారాయణం చేశారు.

◆ **పాఠశాలలో హర్ ఘర్ తిరంగా**



తూప్రాన్: మండలంలోని అల్లాపూర్ పాఠశాలలో మంగళవారం హర్‌ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. జీఎమ్మార్ వరలక్ష్మి ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు జాతీయ జెండాలు ఇచ్చారు. కార్యక్రమంలో జీఎమ్మార్ వరలక్ష్మి ఫౌండేషన్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, పాఠశాల హెచ్‌ఎం సంధ్యారాణి, ఉపాధ్యాయురాలు పాల్గొన్నారు.

◆ **కొనుగోలు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలి**

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు దుకాణ నిర్వాహకులు తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలని మండల వ్యవసాయాధికారి బాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని సోమక్కపేట్ పీఏసీఎస్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈఓ భూపాల్, పీఏసీఎస్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

◆ **క్లైమేట్ స్మార్ట్ గ్రీన్ క్యాంపస్ క్లబ్ ప్రారంభం**

మెదక్‌జోన్: మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం క్లైమేట్ స్మార్ట్ గ్రీన్ క్యాంపస్ క్లబ్‌ను ప్రారంభించారు. వాతావరణ మార్పులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వృక్ష శాస్త్ర అధ్యాపకురాలు డా.శ్రీలత, ప్రిన్సిపాల్ డాక్టర్ హుస్సేన్, డాక్టర్ నాగేందర్‌రావు, వైస్ ప్రిన్సిపాల్, సింహారెడ్డి, కోఆర్డినేటర్ తిరుమల్‌రెడ్డి, గణపతి, డాక్టర్ శరత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

◆ **మధ్యాహ్న భోజనం స్వచ్ఛంద సంస్థలకు అప్పగించొద్దు**

చేగుంట(తూప్రాన్): మధ్యాహ్న భోజనం స్వచ్ఛంద సంస్థలకు అప్పగించొద్దని సీఐటీయూ కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి నర్సమ్మ అన్నారు. మంగళవారం మండల విద్యాధికారి కార్యాలయంలో కార్మికులతో కలిసి వినతి పత్రం అందించారు. యాదమ్మ, గోదావరి, లక్ష్మి, ప్రమిళ, సత్తమ్మ, సుశీల, భారతమ్మ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

◆ **సమస్యలను పరిష్కరించండి**

చిన్నశంకరంపేట(మెదక్): ఉపాధ్యాయ సమస్యలను వెంటనే పరిష్కరించాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకర కృష్ణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీపాఠశాలతో పాటు మడూర్, శాలిపేట, మిర్జాపల్లి, చందంపేట పాఠశాలల్లో పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం సభ్యత్వం అందించారు. పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియోట్ అధ్యక్షుడు మల్లారెడ్డి, శ్రీనివాస్, పీఆర్‌టీయూ నాయకులు ఉన్నారు.

◆ **పీఆర్టీయూ సభ్యత్వ నమోదు**

చేగుంట(తూప్రాన్): సీపీఎస్ రద్దుకు టీపీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం తమవంతు కృషి చేస్తుందని టీపీఆర్టీయూ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని పలు పాఠశాలల్లో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాలను నిర్వహించారు. టీపీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు ఓంప్రకాశ్, లింబేష్, పరమేశ్వర్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, రజిత, శంకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ **జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో రామాయంపేట క్రీడాకారులు**

రామాయంపేట(మెదక్): ఉమ్మడి మండలానికి చెందిన ఇద్దరు విద్యార్థులు జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలో పాల్గొని ప్రతిభ చూపారు. అస్సాంలో అగస్టు 11న జరిగిన పోటీల్లో తెలంగాణ తరపున జడ్‌చెరువు తండాకు చెందిన అంకిత్ నాయక్, రామాయంపేటకు చెందిన శరత్‌చంద్ర పాల్గొన్నారు. జాతీయస్థాయిలో ప్రతిభ కనబర్చిన ఇద్దరు క్రీడాకారులను ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నాగరాజు, యువజ్యోతి అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ అభినందించారు.

◆ **గుల్పర్తిని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలి**

రామాయంపేట(మెదక్): మున్సిపాలిటీ పరిధిలోని గుల్పర్తి గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు అన్నారు. గ్రామస్తులు తహసీల్దార్ రజనికుమారికి వినతిపత్రం అందజేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోతే ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు,

◆ **విద్యార్థులు కష్టపడితేనే భవిష్యత్**

పెద్దశంకరంపేట(మెదక్): విద్యార్థులు కష్టపడితేనే బంగారు భవిష్యత్ ఉంటుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి అన్నారు. మంగళవారం ఇంటర్ విద్యార్థుల స్వాగత కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఇటీవల బదిలీపై వెళ్లిన ప్రిన్సిపాల్ అవనీష్‌రెడ్డిని లెక్చరర్లు సన్మానించారు. కార్యక్రమంలో లెక్చరర్లు అనంతరాజ్, శ్రీశైలం, ప్రభాకర్, రాజు, జహీరాబేగం, సిబ్బంది అశోక్, సిద్ధయ్య, శారద తదితరులు పాల్గొన్నారు.

◆ **రైల్వే అండర్‌పాస్ పనులు ప్రారంభం**

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం మాసాయిపేటలో ఏడాదికాలంగా నిలిచిపోయిన రైల్వే అండర్‌పాస్ నిర్మాణ పనులు ఎంపీ రఘునందన్‌రావు చొరవతో పునఃప్రారంభమయ్యాయి.

వనదుర్గ మండలం ఏర్పాటు చేయాలి

పాపన్నపేట(మెదక్): పాపన్నపేట మండలాన్ని రెండుగా విభజించి, కొత్తగా వనదుర్గ మండలం ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులు మెదక్ ఎంపీ రఘునందన్‌రావుకు మంగళవారం వినతిపత్రం సమర్పించారు.

◆ **బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేయండి**

పాపన్నపేట(మెదక్): కొత్తపల్లి – యూసుఫ్‌పేట గ్రామాల మధ్య నిలిచిపోయిన బ్రిడ్జి పనులను పూర్తి చేయాలని మంగళవారం పీఆర్‌టీయూటీఎస్ మండల శాఖ పక్షాన తహసీల్దార్ లక్ష్మణ్‌బాబుకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి పంతులు రాజు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మహేశ్‌కుమార్, జిల్లా బాధ్యులు రామ్‌రెడ్డి, విక్రాంత్, సురేష్, సంతోష్ కుమార్, శ్రావణ్ కుమార్, నాగేశ్వర్ పాల్గొన్నారు.

◆ **ఆలయంలో భక్తుల పూజలు**



పెద్దశంకరంపేట(మెదక్): శ్రావణమాసాన్ని పురస్కరించుకొని జ్యోతిర్లింగ ఆలయంలో ద్వాదశ జ్యోతిర్లింగాలకు లక్షబిల్వార్చన నిర్వహించారు.